

ఇంట..కందిపప్పు మంట

కంది పప్పు ధర నిప్పులు చెరుగుతోంది. కొంటే చేతులు కాలేటట్టు చేస్తున్నాయి. తిందామంటే వంట మంట రేపుతోంది.
- 8లో



అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

వీ.కోట మండలంలో మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో



విజిలెన్స్ దాడులు

చిత్తూరు, పలమనేరు మండలాల్లో ఎరువుల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు.
- 8లో

న్యూస్‌రీల్

8న ఐటీఐలో జాబ్‌మేళా

పుంగనూరు: పట్టణ సమీపంలోని ఐటీఐ కళాశాలలో ఈనెల 8న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలిపారు. తమ ఐటీఐలో అలాగే తంబళ్లపల్లె ఐటీఐలో శిక్షణ పొందిన వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ధృవపత్రాలు, ఆధార్ కార్డును జాబ్‌మేళాకు తీసుకురావాలన్నారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నుంచి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బోయకొండ ఆలయ ఈఓగా ఏకాంబరం



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఏకాంబరంను నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో ఈఓగా పని చేస్తున్న ఆయన ఈఓగా ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ దాదాపు ఐదు నెలలుగా ఇన్‌చార్జి ఈఓగా వ్యవహరిస్తున్న చంద్రమౌళి గుంటూరు దేవదాయశాఖ జోన్ కార్యాలయంలో జేవీఓగా బదిలీ అయ్యారు.

10న 'పెన్షన్ అదాలత్'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 10వ తేదీ వెబెక్స్‌లో పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్టు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రీజినల్ కమిషనర్ గౌరవ్ మహల్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎస్ 1995 పెన్షనర్లు, సభ్యులకు ఈపీఎస్, 1995 నిబంధనలు అర్థం చేసుకునేందుకు, ఫిర్యాదులు పరిష్కరించుకునేందుకు ఈ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. పెన్షనర్లు వెబెక్స్ మీటింగ్ నంబర్ 26446639754, పాస్‌వర్డ్ 1234 నంబర్‌తో 10వ తేదీ ఉదయం 11 గంటలకు లాగిన్ అవ్వాలని ప్రకటనలో కోరారు.

ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీగా పరశురాం



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీగా పరశురాం నాయుడు నియమిస్తూ డీఈఓ దేవరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఆ స్థానంలో పనిచేస్తున్న హేమారెడ్డి గత నెల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో వి.కోట మండల కేంద్రంలోని బాలుర జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న హెచ్‌ఎం పరశురాం నాయుడును నియమించారు. అంతకుముందు చిత్తూరు రూరల్ మండలం పెరుమాళ్లకండ్రిగ, సిద్ధంపల్లె, రామకుప్పం మండలం సింగసముద్రం పాఠశాలల్లోనూ ఆయన పనిచేశారు. ఆయనను ఎస్టీయూ నేతలు గంటామోహన్, పురుషోత్తం, మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ తదితరులు పుష్పగుచ్ఛంతో అభినందించారు.

పులివర్తి నానికి భారీ నజరానా!

'ఆయన ఒక ఎమ్మెల్యే.. ఆ నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాల్సిన పూర్తి బాధ్యత ఆయనదే. పదిమందికీ అనుకూలమైన రహదారుల నిర్మాణం.. గ్రామాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కోసం నిధులు సమీకరించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాల్సిన బాధ్యత కూడా ఆయనదే. అయితే అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు ఆ ఎమ్మెల్యే. ప్రభుత్వ అధికారులను బెదిరించడం.. వ్యాపారులను టార్గెట్ చేయడం.. తన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కల్గించడం.. కాంట్రాక్టర్లకు బిల్లులు రానీయనంటూ హెచ్చరికలు జారీ చేయడం.. వంటి చర్యలతో ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తాజాగా ఓ కాంట్రాక్టర్‌కు చెందిన రెండెకరాల భూమిని తన పేరిట రాసివ్వాలని ఒత్తిడి చేయడంతో సదరు వ్యక్తి ఏమీ చేయలేక తన భూమిని స్వాధీనం చేశారు. ఇంతకూ ఎవ్వరు ఆ ఎమ్మెల్యే ? ఏమా కథ ? తెలుసుకోవాలంటే దీన్ని చదవాల్సిందే'.

- టీటీడీ రోడ్డు నిర్మాణ పనులు జరగకుండా అడ్డంకులు
- కోట్ల రూపాయల బిల్లులకు బ్రేక్ వేస్తానని బెదిరింపులు
- అగరాల వద్ద విలువైన పట్టా భూమి రాసివ్వాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే హుకుం
- రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమి రాసిచ్చిన కాంట్రాక్టర్
- ఆ భూమిలో ఇంటి నిర్మాణానికి చకచకా పనులు



కాంట్రాక్టర్‌కు చెందిన భూమిలో పులివర్తి నాని నివాసానికి చదును చేసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'పులివర్తి నాని ఓ మేకవన్నెపులి. ఇన్నాళ్లు ప్రతిపక్షంలో ఉండడంతో ఆయన నిజ స్వరూపాన్ని ప్రజలు గ్రహించలేకపోయారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన వెంటనే తన అసలు స్వరూపాన్ని బయటపెట్టేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి దందాలు.. సెటిల్‌మెంట్లతో మొదలుపెట్టి.. ఇప్పుడు బెదిరింపులు.. బరితెగింపులకు దాకా వచ్చేశారు. ఏ పనులు సాఫీగా జరగాలన్నా.. నగానట్రా..బిల్లులు వగైరా రావాలన్నా తాను అడిగినంత ఇచ్చుకోవాల్సిందేనని హుకుం జారీచేస్తున్నారు. కాదు..కూడదంటే అధికారమదంతో పేట్రేగిపోతున్నారు. దాడులు చేయిస్తూ.. ఆస్తులు ధ్వంసం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికార అండదండలతో బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో గత్యంతరం లేక కాంట్రాక్టర్లు.. వ్యాపారులు ఆయన అడిగినంత సమర్పించుకుంటున్నారు. ఇటీవల చోటుచేసుకున్న ఓ ఘటన మచ్చుకు మీ కోసం.. వివరాలు..

తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి పంచాయతీకి చెందిన సర్పంచ్ సుభాషిణి భర్త శుభగిరి క్లాస్–1 కాంట్రాక్టర్. ఈ క్రమంలో చెర్లోపల్లి జంక్షన్ నుంచి వకుళమాత గుడి వరకు టీటీడీ నుంచి టెండర్ ద్వారా నూతనంగా రహదారి నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకున్నారు. పనులు కూడా దాదాపు పూర్తికావస్తున్న తరుణంలో చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిచిన పులివర్తి నాని ఆ కాంట్రాక్టర్‌ను టార్గెట్ చేశారు. టీటీడీ రోడ్డు పనులు నిలిపివేయించడంతో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల బిల్లులను నిలుపుదల చేయిస్తానని బెదిరించారు. తన బిల్లులకు ఇబ్బంది లేకుండా అన్ని పనులు సాఫీగా సాగాలంటే చంద్రగిరి మండలం, అగరాల వద్ద సదరు కాంట్రాక్టర్‌కు చెందిన రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని తనకు స్వాధీనపరచాలని ఎమ్మెల్యే నాని హుకుం జారీచేశారు. దీంతో కోట్ల రూపాయల బిల్లులు ఆగిపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందిన ఆ కాంట్రాక్టర్ రూ.7 కోట్ల విలువైన తన భూమిని ఎమ్మెల్యే నానికి స్వాధీనం చేశారు. ఆ స్థలంలోనే ఎమ్మెల్యే పులివర్తి నాని నూతన ఇంటి నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు సమాచారం.

చకచకా ఇంటి నిర్మాణ పనులు

సర్పంచ్ భర్త నుంచి నిస్సిగ్గుగా స్వాధీనం చేసుకున్న భూమిలో ఇంటి నిర్మాణానికి అనుకూలంగా ఆ భూమిలో చదును చేసే పనులను శరవేగంగా నిర్వహిస్తున్నారు. కాగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన గెలిచిన 30 రోజుల్లో అన్ని వర్గాల వారిని ఇంతలా వేధింపులకు గురిచేస్తుండడం, ఇంతగా తెగించి అవినీతికి పాల్పడుతుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండిపడుతున్న అధికార పార్టీ నాయకులు

టీటీడీ నిధులతో నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను అడ్డుకుని సదరు కాంట్రాక్టరు ద్వారా రెండు ఎకరాల భూమిని ఎమ్మెల్యే పులివర్తి నాని తీసుకున్న విషయం బయటకు రావడం, ఇప్పటికే టీటీడీలో పర్సెంటేజీల వ్యవహారంపై సమగ్ర విచారణ జరుగుతుండడంతో దీనిపై కూడా పూర్తి విచారణ చేయాలని స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రభుత్వాన్ని, టీటీడీపై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులను కోరుతుండడం విశేషం. ఈ విషయాన్ని పార్టీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు స్థానిక టీడీపీ నాయకులు చెబుతున్నారు.

గుండె మార్పిడి విజయవంతం

- టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రిలో 16వ గుండె మార్పిడి
- 15 సంవత్సరాల యువతికి 40 ఏళ్ల వ్యక్తి గుండె అమరిక



రేణిగుంట విమానాశ్రయంలో ఇండిగో విమానం నుంచి గుండెను తీసుకొస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల గుండె చికిత్సాలయంలో శుక్రవారం సాయంత్రం 16వ గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి నేతృత్వంలోని ఆరుగురు వైద్యుల బృందం 15 సంవత్సరాల యువతికి 40 ఏళ్ల వ్యక్తి గుండెను అమర్చి పునర్జన్మను ప్రసాదించారు. వైఎస్సార్ జిల్లా, పుల్లంపేట ప్రాంతానికి చెందిన నిరుపేద యువతికి వైద్యులు ప్రాణభిక్ష పెట్టారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న యువతి వివిధ ప్రాంతాల్లోని వైద్యులను సంప్రదించి చికిత్స చేయించారు. సమస్య తీవ్రం కావడంతో నాలుగు నెలల క్రితం శ్రీ పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ వైద్యులు అన్ని పరీక్షలు నిర్వహించగా గుండె సామర్థ్యం పూర్తిగా క్షీణించిందని, గుండె మార్పిడి అనివార్యమని నిర్ధారించారు. ఈ క్రమంలో 'అవయవదాన్'లో యువతి వివరాలను నమోదు చేశారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లాకు చెందిన 40 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆ వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు . కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకొచ్చారు. ఈ క్రమంలో గుండె అందుబాటులోకి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న తిరుపతిలోని చిన్న పిల్లల హృదయాలయ వైద్యులు అక్కడికి చేరుకొని బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి గుండెను సేకరించారు. సాయంత్రం ఇండిగో విమానంలో గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రీన్ చానల్ ద్వారా శ్రీ పద్మావతి చి ల్డ్రన్స్ కార్డియాక్ కేర్ సెంటర్‌కు తరలించారు.

ఐదు గంటలు శ్రమించిన వైద్యులు

గుండె మార్పిడి వైద్య ప్రక్రియను డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వైద్యుల బృందం ఐదు గంటల పాటు శ్రమించి విజయవంతంగా పూర్తిచేసింది. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మొదలైన ఈ గుండె మార్పిడి ప్రక్రియ రాత్రి 11 గంటలకు ముగిసింది. గుండె మార్పిడి విజయవంతం కావడంతో వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు. గుండెను దానం చేసేందుకు వచ్చిన బాధితుడి కుటుంబ సభ్యులకు జీవితాంతం రుణపడి ఉంటామని యువతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

- భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశం

కుప్పం: పట్టణంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్ల నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనల సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక పాతపేటలోని బీసీ, ఎస్సీ బాలురు వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. శిథిలావస్థకు చేరుకున్న గృహంలో హాస్టల్‌ను కొనసాగిస్తున్నట్టు స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ పైవిధంగా స్పందిస్తూ.. 200 మంది విద్యార్థులు ఉండేవిధంగా వసతి గృహాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న హాస్టళ్ల చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసి విద్యార్థులకు దోమల బెడద లేకుండా చేయాలని, అలాగే కిటికీలు, మెష్‌లు ఏర్పాటు చేయాలని, హాస్టళ్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరావు, స్థానిక నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



పాతపేటలోని హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ట్రాన్స్‌కో తనిఖీలు

- 501 సర్వీసులపై కేసులు
- రూ.10.17లక్షలు చెల్లించాలని నోటీసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 2,719 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 98, తిరుపతి రూరల్ 57, చిత్తూరు అర్బన్ 74, చిత్తూరు రూరల్ 53, మదనపల్లె 97, పీలేరు 63, పుంగనూరు పరిధిలో 59 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 424 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.9.48 లక్షలు, చౌర్యం కేసులు 77కు గాను రూ.69 వేలు జరిమానాతో కలిపి మొత్తం 501 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.10.17 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ సురేంద్రనాయుడు వెల్లడించారు.

జాబితాలు సిద్ధం చేయరూ!

- వివరాలను పారదర్శకంగా విద్యాశాఖ వెబ్‌సైట్లో పెట్టండి
- ఉద్యోగోన్నతి సీనియారిటీపై డీఈఓకు ఎస్టీయూ నేతల వినతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితాలు సిద్ధం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం డీఈఓ దేవరాజును కలిసి అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఉద్యోగోన్నతులకు జాబితాలను పారదర్శకంగా సిద్ధం చేసి వాటిని విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేయాలని కోరారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో టీచర్ల నియామకం, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ నుంచి రివర్షన్ కోరిన టీచర్లకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. గత ఏడాది బదిలీల్లో బదిలీ అయినప్పటికీ ఇంకా రిలీవ్ కాని టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, రాష్ట్ర నాయకులు గంటామోహన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నేతలు

క్లుప్తంగా

స్కూళ్ల బస్సుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డీటీసీ నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరులోని స్కూళ్ల బస్సుల నిర్వహణపై గురువారం జిల్లా రవాణ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ బస్సుల కండిషన్ పరిశీలించారు. రికార్డులపై ఆరా తీశారు. స్కూళ్ల బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడిస్తే సీజ్ చేస్తామని, జరిమానా తప్పదని హెచ్చరించారు.

సీబీఎస్‌సీ టెన్త్ విద్యార్థులకు తెలుగు పుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సీబీఎస్‌సీ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి తెలుగు పుస్తకాలు పంపిణీ చేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వులు శుక్రవారం డీఈఓ కార్యాలయానికి చేరాయి.జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పదవ తరగతి సీబీఎస్‌సీ విధానంలో 1,599 మంది విద్యార్థులు పదవ తరగతి చదువుతున్నారు. వీరికి తెలుగు పుస్తకాలు అందజేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థులకూ నోటుపుస్తకాలు, బ్యాగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదివే విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ సంకల్పించింది. జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు పెద్ద బ్యాగు, 12నోటు పుస్తకాలు ఇవ్వనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేసి పంపాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సరఫరా చేసి డ్యామేజ్ అయిన నోటు పుస్తకాలను వెనక్కు తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● ధర..దడ

ఇంట..కందిపప్పు మంట

- మార్కెట్లో కందిపప్పు డబుల్ సెంచరీ
- చౌక దుకాణాల్లో కందిపప్పు పంపిణీకి మంగళం
- రైతుబజారులో రాయితీ పేరుతో హడావిడి
- ధరాఘాతంతో సామాన్య జనం ఉక్కిరిబిక్కిరి

కాణిపాకం: కంది పప్పు ధర నిప్పులు చెరుగుతోంది. కొంటే చేతులు కాలేటట్టు చేస్తున్నాయి. తిందామంటే వంట మంట రేపుతోంది. ఏం కొనేటట్టు లేదు..ఏం తినేటట్టు లేదంటూ సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కిచెన్‌లో కల్లోలం రేగుతోంది. వంట నూనె ధరలు తగ్గుముఖం పట్టాయని సంతోషిస్తున్న సగటు జీవిపై ఇప్పుడు పప్పు భారం పడుతోంది. మార్కెట్లో మొదటి రకం కందిపప్పు ధర రూ.200లకు చేరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చౌక దుకాణాల్లో పంపిణీ చేసే కంది పప్పును నిలుపుదల చేసింది. రైతు బజారులో రాయితీ పేరుతో హడావిడి చేస్తోంది. ధరాఘాతంతో ప్రజలు విలవిలలాడుతున్నారు.

జిల్లాలో 1,339 చౌక దుకాణాలున్నాయి. గతనెల వరకు ఈ షాపుల ద్వారా బియ్యం, చక్కెరతోపాటు కందిపప్పు పంపిణీ చేసేవారు. జిల్లా వ్యాప్తంగా 5,31,019 తెల్లకార్డుదారులుంటే... కార్డుకు కేజీ చొప్పున పప్పు ఇచ్చేవారు. ఈ లెక్కన ప్రతినెలా 500 టన్నుల మేర జిల్లాకు అవసరమయ్యేది. పప్పు ధరలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం పప్పు భారాన్ని భరిస్తూ వచ్చింది. పేదలకు రాయితీతో పప్పును కేజీ రూ.67లకే ఇస్తూ వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చాక ఈ పంపిణీకి మంగళం పాడింది. దీంతో పేద ప్రజలు కందిపప్పుకు దూరమయ్యారు. కందిపప్పు కేజీ ధర మార్కెట్లో రూ.200 ఉండడంతో కొనలేని పరిస్థితి తలెత్తింది.

పప్పు పైపైకి...

కందిపప్పు ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. మళ్లీ ఈ ధరలు పెరిగే అవకాశాలున్నాయని వ్యాపారులు చెబుతుండడంతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో మొదటి రకం కేజీ ధర రూ.200 పలుకుతోంది. రెండో రకం రూ.170 నుంచి 180 వరకు అమ్ముతున్నారు. పెద్ద పెద్ద మాల్స్‌లో ఆఫర్ పేరుతో కేజీ ధర రూ. 185 నుంచి రూ.187 వరకు విక్రయిస్తున్నారు. పల్లెలోని చిల్లర దుకాణాల్లో కేజీ ధర రూ.230 పైమాటే. దీంతో సామాన్య ప్రజలకు కందిపప్పు ప్రియమైంది. ఇక రేషన్ షాపుల్లో ఇచ్చే పప్పుకు మంగళం పాడడంతో మార్కెట్లో కొనలేని పరిస్థితి నెలకొంది. రైతు బజారులో రాయితీపై రూ.165లకే ఇస్తున్నారు. అయితే ఈ రాయితీ పప్పు అక్కడికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కందిపప్పును రేషన్ షాపుల ద్వారా ఇవ్వాలని కార్డుదారులు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన సాగు....

కందిసాగు ఏటా తగ్గుతూ వస్తోంది. వాతావరణం అనుకూలించకపోవడంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఇక సాగులో ఉన్న పంటను పందులు, పాడిఆవులు మేత మేస్తున్నాయి. మిగిలింది రైతు చేతికి దక్కుతోంది. జిల్లాలో చాలా మంది రైతులు కందిని అంతర పంటగా వేస్తారు. 10 శాతం మంది రైతులు మాత్రం పూర్తి స్థాయిలో కందిని పండిస్తారు. ఈ లెక్కన్న జిల్లాలో గతేడాది కంది 3,200 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఇందులో 12 వేల నుంచి 15వేల క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 8 వేల క్వింటాళ్లు దిగుబడి మాత్రమే వచ్చింది. వేరుశనగ విత్తు కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో కందిసాగుపై ఆశలు ఆవిరవుతున్నాయి. ఈసారి కూడా జిల్లాలో వేరుశనగతో పాటు కంది సాగు పూర్తి స్థాయిలో తగ్గే అవకాశాలున్నాయని పలువురు రైతులు చెబుతున్నారు.



చిత్తూరులోని రైతు బజారులో రాయితీ కందిపప్పు విక్రయ కేంద్రం

ధర పెరిగే అవకాశం

ఏ తరగతి వర్గం ప్రజలైనా తమ ఇంట కందికప్పు వినియోగానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కందితో పప్పు, పప్పు చారు, చట్నీ..రసం పొడి తయారీకి కందిపప్పు వాడుతుంటారు. అయితే ఇప్పుడు కందిపప్పు ధర ప్రజలకు దడ పుట్టిస్తోంది. 20 రోజులుగా కందిపప్పుతో కూరలు చేయడం లేదని, ధర చూస్తేనే ఠారెత్తిపోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిపంట పూర్తిగా తగ్గిపోవడంతోనే ధర భారీగా పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవానికి ప్రస్తుతం కంది పంట రావడం లేదు. అయితే వ్యాపారులు ముందుగానే రైతులతో తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వలు ఉంచుకుని ఏకంగా కంది పప్పు ధరలను పెంచినట్లు రైతుల ఆరోపణ. కంది పంట వచ్చే వరకు అంటే డిసెంబర్ లేదా జనవరి వరకు ఇదే ధరతో.. ఇంతకన్నా భారీగా ధర పెరిగినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు బాగా కురిసి కంది పంట పండితే డిసెంబర్ తర్వాత కంది పప్పు ధర తగ్గే అవకాశం ఉందని సమాచారం.

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ.5లక్షలు, 9 మోటర్‌సైకిళ్లు స్వాధీనం

వి.కోట: మండలంలో మోటార్‌సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను శుక్రవారం వి.కోట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5లక్షల నగదు, 9 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పలమనేరు డీఎస్పీ రఘువీర్ విష్ణు విలేకరులకు తెలిపిన వివరాలు..తమిళనాడు రాష్ట్రంలోని తిరుపత్తూరు జిల్లా వసంతాపురం గ్రామానికి చెందిన కాసీ కుమారుడు ప్రభు (25), అదే జిల్లా వాణియంబాడి తాలూకు నర్సింగ్‌పురం గ్రామానికి చెందిన దండపాణి కుమారుడు కార్తీక్(23) ఇద్దరూ కలిసి ఇటీవల వి.కోటకు వచ్చారు. వీరు చిన్న వయస్సులోనే జల్సాలు అలవాటు పడి, డబ్బు కోసం చోరీల బాట పట్టారు. ఈ నేపథ్యంలో రెండు నెలల నుంచి వి.కోటలో మకాం వేసి వివిధ చోట్ల ఆరు మోటార్ సైకిళ్లను చోరీ చేసి వాటిని తమ ఇంట దాచిపెట్టారు. ఇటీవల మోటార్ సైకిళ్ల చోరీ కేసులు అధికమవడంతో దీనిని సీఐ లింగప్ప సవాల్‌గా తీసుకున్నారు. దొంగల భరతం పట్టేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వి.కోట–పేర్నంబట్ జాతీయ రహదారిలోని వీఎస్ఆర్ కళ్యాణ మండపం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. పేర్నంబట్ వైపు నుంచి వి.కోటకు ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంలో వస్తూ పోలీసులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిని అనుమానించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో వీరిద్దరే వి.కోటలో మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న దొంగలని తేలింది.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

అంతేకాకుండా చిత్తూరు టౌన్, తాయులూరు, పేర్నంబట్ పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ మరో మూడు ద్విచక్రవాహనాలను సైతం చోరీ చేసినట్లు నిందితులు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు వారి వద్ద సుమారు రూ.5 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసి గుట్టుగా బైకులు ఉంచిన ప్రాంతానికి వెళ్లి బజాజ్ పల్సర్లు: 3, హీరో స్ప్లెండర్ ప్లస్‌లు: 6 స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

భవిష్య నిధి లెక్కలు తేల్చండి

– జెడ్పీ సీఈఓకు ఎస్టీయూ నేతల వినతి

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల కోట్లాది రూపాయల భవిష్యనిధి లెక్కలు తేల్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ కోరారు. శుక్రవారం ఆ అసోసియేషన్ నాయకులు జెడ్పీ సీఈఓ గ్లోరియాను కలిసి వినతి పత్రం అందజేశారు. పలు అంశాలపై ఆమెతో చర్చించారు. వారు మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయులు నెల నెలా జీతాల నుంచి పొదుపు చేసుకున్న భవిష్య నిధి మొత్తాల వివరాలను పారదర్శకంగా బహిర్గతం చేయాలని కోరారు. కోట్లాది రూపాయల పీఎఫ్ మొత్తాల వివరాలు రహస్యంగా దాచి పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో రుణాలు, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తుది మొత్తాలు పొందడంలోనూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర నేత గంటామోహన్ మాట్లాడుతూ, హఠాన్మరణం పొందిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వడంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా కారుణ్య నియామకాలకు సంబంధించిన వ్యవహారాలను పునః పరిశీలన చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను ఖాళీగా ఉన్న ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక, రాజకీయ పలుకుబడి లేని వారికి ఇబ్బందులు కలిగించే విధంగా సుదూర ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో పోస్టింగ్స్ ఇచ్చారని తెలిపారు. పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్‌కు సంబంధించి టీచర్లు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే అవసరం లేకుండా, జీతాల డ్రాయింగ్ ఆఫీసర్లకు సూచనలు జారీ చేయాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు బోధనేతర సిబ్బందిని నియమించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన స్థలాలు చాలా చోట్ల ఆక్రమణలకు గురయ్యాయని, దీనిపై సర్వే చేయించి ఆయా రికార్డులను మండల, జిల్లా స్థాయిలో భద్రపరచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పురుషోత్తం, లోకనాథరెడ్డి, దేవరాజులు రెడ్డి, మునెప్ప మొదలి, పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, నాగభూషణం, గిరిబాబు, లింగయ్య, మురళి, లక్ష్మీనారాయణ, బాబురెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

టీడీపీ నేతల బెదిరింపులతో వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు

పాలసముద్రం : టీడీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి పాలసముద్రం మండలంలో సైతం టీడీపీ నేతల బెదిరింపులతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. సీఎం కండ్రిగకు చెందిన కుమార్ అనే కేజేపురంలోని తన పట్టా భూమిలో జేసీబీతో భూమి చదును పనులకు పూనుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మనోహర్‌కు చెందిన జేసీబీని ఈ పనులకు వినియోగించాడు. అయితే టీడీపీ నాయకులు ఒత్తిళ్లతో ఓ పోలీసు అక్కడికి వెళ్లి జేసీబీని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అయితే సొంత భూమిలో మట్టి పనులు చేస్తున్నారని, ఇదేమీ కేసు కాదని జేసీబీని తీసుకెళ్లమని ఎస్ఐ భారతి పురమాయించారు. అలాగే తహసీల్దార్ సుబ్బులక్ష్మమ్మకు విషయాన్ని బదలాయించారు. అయితే టీడీపీ నాయకులు ఫోన్లలో తహసీల్దార్, ఎస్ఐపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే థామస్ నుంచి ఫోన్ చేయించారు. తహసీల్దార్ అనుమతి లేకుండా జేసీబీతో మట్టిని అక్రమంగా తీస్తున్నారని తప్పుడు రికార్డు సృష్టించి, జేసీబీ యజమానిపై కేసు బనాయించారు. అలాగే ఆముదాలలో టీడీపీ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఇది కూడా వైఎస్సార్ సీపీ నాయకులే చేశారంటూ 14మందిపై కేసులు పెట్టారు. తమపై తీవ్ర ఒత్తిళ్లు తెస్తున్నారని, వారికి తలొగ్గడం మినహా ఏం చేయలేయలేమని మండల స్థాయి అధికారులు నిస్సహాయత వ్యక్తం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, డీలర్లకూ తప్పని బెదిరింపులు!

అంతేకాకుండా టీడీపీ నాయకులు తమను కూడా బెదిరిస్తున్నారని ఫీల్డ్‌అసిస్టెంట్లు, సంఘమిత్రలు, రేషన్ షాపుల డీలర్లను గగ్గోలు పెడుతున్నారు. విధుల నుంచి తొలగాలని, డీలర్‌షిప్ రద్దు చేసుకోవాలని, లేదంటే తామే తొలగిస్తామని టీడీపీ నాయకులు అల్టిమేటం ఇస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి టీడీపీ నేతల ఆగడాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

విజిలెన్స్ దాడులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జ్యోతి, బాలాజీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు సూర్యనారాయణ, చంద్రశేఖర్ దాడులు చేశారు. రికార్డులను పరిశీలించారు. క్రయ విక్రయాలపై ఆరా తీశారు. ఎరువుల నాణ్యత, స్టాక్ తదితరులను క్షుణ్ణంగా చూశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఉమ, ఏఐ సుజాత, ఏఓ వేణు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె సమీపంలో భూమి అగ్రి బయో ఫ్యూచర్ ప్రైవేట్ కంపెనీపై గుంటూరుకు చెందిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేశారు. స్పెషల్ కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ (గుంటూరు) ఆదేశాల మేరకు దేవనారాయణ, డీపీఓ, నెల్లూరు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ స్థానిక మండల వ్యవసాయాధికారిణి సంధ్యతో కలిసి దాడులు చేశారు. ఇక్కడి కంపెనీలో తయారయ్యే బయోమందులు, విత్తనాలు, వాటి ముడిసరుకు, బయో పురుగు మందులను పరిశీలించారు. వీటిలో నాణ్యతా ప్రమాణాలున్నాయా, లేదా? అనే కోణంలో విచారణ చేశారు. తమ దాడుల్లో గుర్తించిన విషయాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.



పలమనేరు: కొలమాసనపల్లె ప్రైవేట్ బయో కంపెనీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు కోరారు. చిత్తూరులోని కాజూరు అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో శుక్రవారం ఫ్రైడే..డ్రైడే నిర్వహించారు. నీటి నిల్వలను గుర్తించి వాటిని తొలగించారు. దోమల వ్యాప్తిని కట్టడి చేసేందుకు అబేటు పిచికారీ చేశారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణ, పీరూసాహెబ్, నారాయణ, భానుమతి, తులసి తదితరులు పాల్గొన్నారు.



నీటి నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు

పోలీస్ మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

చిత్తూరు అర్బన్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సుబ్రమణ్యం అనే హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చిత్తూరు ఏఎస్పీ ఆరీఫుల్లా రూ.లక్ష కార్పస్ ఫండ్ చెక్కును శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అందచేశారు. 2022 జనవరిలో సుబ్రమణ్యం మృతి చెందాడు. ఈయన భార్య అమ్ములుకు ఈ మొత్తాన్ని అందచేశారు.



చెక్కు అందచేస్తున్న ఏఎస్పీ ఆరీఫుల్లా

ఉచితంగా కృత్రిమ కాళ్లు

- 26న చిత్తూరు ప్రత్యేక శిబిరం
- 20 రోజుల అనంతరం కృత్రిమ కాళ్ల అమరిక
- జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా తక్కువ బరువు ఉన్న ఆధునిక కృత్రిమ కాళ్లను అమర్చనున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఈ నెల 26న జిల్లా కేంద్రంలోని తపోవనం వద్ద కృతిమ కాళ్ల శిబిరం నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంప్‌లో కృతిమ కాళ్ల కోసం వారి కొలతలు తీసుకుంటారన్నారు. అనంతరం 20 రోజుల తర్వాత రూ.51 వేల విలువ గల కృతిమ కాలును ఉచితంగా అమర్చుతారని చెప్పారు. కృతిమ కాలు కావాల్సిన వారు ఈ నెల 18వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. శిబిరానికి వచ్చేటప్పుడు ఆధార్, రేషన్, సదరం కార్డులు, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్ రెండు సెట్ల జిరాక్సులు తీసుకుని రావాలన్నారు. ఇతర జిల్లాల విభిన్న ప్రతిభావంతులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 9440357522, 6281486722 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైలు కింద పడి ఆత్మహత్య

పుత్తూరు: స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి మీడియాకు తెలిపిన వివరాలు..పుత్తూరు మండలం ఉత్తరపుకండ్రిగ ఎగువ దళితవాడకు చెందిన ఎ.నారాయణమూర్తి(32) వందే భారత్ ట్రైన్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అడవి పందుల వేట

ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్ట్

యాదమరి (పూతలపట్టు): ఇద్దరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అడవి పందులను వేటాడిన ఘటన యాదమరి మండలంలో చోటుచేసుకుంది. స్థానిక సమాచారం మేరకు.. యాదమరి మండలం పత్రపల్లె పంచాయతీ పొచిగుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అరుల్, భాస్కర్ బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని అడవికి వెళ్లి అడవి పందిని వేటాడారు. గురువారం రాత్రి అటవీ శాఖ అధికారులకు రహస్య సమాచారం అందడంతో స్పందించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నిశ్చలబాబు ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి నుంచి అడవి పంది మాంసం, అరుల్ ఇంటిలో జింక కొమ్మును కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఇదలా ఉంచితే, వీరిద్దరూ గతంలో కూడా వన్యప్రాణులను వేటాడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాతకక్షలతో వృద్ధునిపై దాడి

పలమనేరు: మండలంలోని పి.వడ్డూరుకు చెందిన కృష్ణప్ప(70)పై అదే గ్రామానికి చెందిన జయప్రకాష్ తదితరులు దాడిచేసి గాయపరచిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పాతకక్షల కారణంగానే ఈ గొడవ జరిగినట్టు స్థానికుల సమాచారం. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం కుటుంబీకులకు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దత్తతకు కోడె గిత్తలు.. దూడలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి గోశాలలోని కోడె గిత్తలు, దూడలను దత్తతకు ఇచ్చేందుకు అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వ్యవ సాయం చేస్తూ పట్టాదారు పాసు పుస్తకం గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హిందూ మతానికి చెందిన రైతులకు మాత్రమే దత్తతకు ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల రైతులు వ్యవ సాయం చేస్తున్నట్లు వీఆర్ఓ ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు, రూ.100 విలువైన నాన్ జ్యుడీషి యల్ స్టాంప్ పేపరును జతచేసి ఆలయ కార్యాలయానికి అందించాలని సూచించారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం



సిబ్బందికి నగదు రివార్డులు ఇస్తున్న సుబ్బరాజు తదితరులు

–జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బరాజు

చిత్తూరు అర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తే ఉక్కుపాదం మోపాలని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సుబ్బరాజు ఆదేశించారు. శుక్రవారం ఎస్ఈబీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక మద్యం, గంజాయి అక్రమ రవాణాపై క్షేత్రస్థాయిలో సమాచారం తెప్పించుకోవాలన్నారు. నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించరాదన్నారు. అలాగే సారా తయాదీదారులు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు తెప్పించే పెద్ద ముఠాలను పట్టుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పలువురు సిబ్బందికి నగదు రివార్డులు అందచేశారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్, ఏఈఎస్ రవికుమార్ పాల్గొన్నారు.

పల్లెలో అదృశ్యం..అడవిలో ప్రత్యక్షం!

- అయ్యో!.. పాపం పసివాడు
- ఏడుపు విని ఇంటికి తీసుకెళ్లిన గిరిజనులు
- ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు..

పలమనేరు: ఓ బాలుడు ఇంటి నుంచి అదృశ్యమై తిన్నగా అడవిలో తేలాడు. ఆపై ఇంటికెళ్లే దారి తెలియక బావురుమన్నాడు. అతడి ఏడుపు విన్న గిరిజనులు అక్కున చేర్చుకున్నారు. ఇది వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయింది. ఎట్టకేలకు తల్లిదండ్రులకు చెంతకు చేరడంతో అతడి కథ సుఖాంతమైంది. వివరాలు..మండలంలోని తెల్లగుండ్లపల్లెకు చెందిన కుమార, కొండమ్మల నాలుగేళ్ల కుమారుడు గురువారం ఉదయం గ్రామంలో ఆడుకుంటూ తిన్నగా సమీపంలోని కౌండిన్య అడవిలోకి వెళ్లిపోయాడు. అదృష్టవశాత్తు ఏనుగుల బారిన పడలేదు. అక్కడ అతడి ఏడుపు విన్న అడవిలో నడిమికల్లాడు(నడిమిదొడ్డిపల్లె)కు చెందిన యానాదులు ఆ బాలుడిని తమ ఇంటికి తీసుకెళ్లారు. ఇంతలో తమ కుమారుడు కనిపించకపోవడంతో కుమార దంపతులు ఆందోళన చెందారు.

అతడి కోసం గాలించసాగారు. అలాగే వాట్సాప్ గ్రూపుల్లో బాలుడి గురించి పెట్టించడంతో ఈ విషయం అందరికీ తెలిసింది. ఎట్టకేలకు నడిమిదొడ్డిపల్లెలో ఉన్నట్టు తెలుసుకొని ఆ తల్లిదండ్రులు ఆ బాలుడిని శుక్రవారం తీసుకెళ్లారు. ఈ విషయమై స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా 'సాక్షి'తో మాట్లాడుతూ గ్రామంలోంచి బాలుడు అదృశ్యమై, ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేరాడని చెప్పారు.